ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 9 జనవరి 2024

సరిచేస్తారా.. వదిలేస్తారా..?





- పారదర్శక ఓటర్ల జాబితా వచ్చేనా?
- భారీగా ఫారం-7 దరఖాస్తుల తిరస్కరణ
- ప్రతిపక్షాల అభ్యంతరాలకు పరిష్కారం దొరుకుతుందా?
- సీఈసీ బృందానికి ఏం చెప్పాలి?

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

ఎన్నికల్లో గెలుపునకు ప్రతి ఓటు కీలకమే. ఒక్కోసారి ఒక్క ఓటుతోనే ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉంటుంది. ఎన్నికలు సజావుగా సాగాలంటే తప్పిదాలులేని ఓటరు జాబితా రూపొందించడం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పేరుండేలా.. అనర్హులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేలా ముసాయిదా ఓటర్ల జాబితాలో వందశాతం తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించే బాధ్యత అధికార యంత్రాంగానిదే. కొత్త ఓటు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, మృతులు, ఒకే డోర్ నంబరుపై పది ఓట్ల కన్నా ఎక్కువగా ఉన్న వాటి పరిశీలన, డబుల్ ఎంట్రీలు, జీరో డోర్ నంబరు ఓటర్లు, ఒకే రకమైన ఫొటోలు, శాశ్వత వలస వెళ్లిన వారిపై ఓట్లతో తప్పులతడకగా మారింది. జాబితాలో తప్పులతడకపై ప్రతిపక్ష పార్టీలు.. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు ఆధారాలతో ఫిర్యాదు చేశాయి. ఎన్నికల సంఘం ఆదేశాలతో పోలింగ్ కేంద్రాల వారీగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఫారం-6, 7, 8 కింద వచ్చిన దరఖాస్తులపై బీఎల్వోలు క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఫారం-6 దరఖాస్తులే అత్యధికంగా రాగా.. ఆ తర్వాత స్థానంలో ఫారం-7 వచ్చాయి. ఇందులో వేలాది దరఖాస్తులను తిరస్కరించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవడానికి అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో తమకు అనుకూలమైన వారి ఓట్లను చేర్చడం, విపక్ష పార్టీల వారి ఓట్లు తొలగించడం ద్వారా లబ్ధిపొందాలని చూస్తోందని వారు వాదిస్తున్నారు. ప్రతిపక్షపార్టీల సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు అధికార పార్టీ వైసీపీ ఇప్పటికే పలుచోట్ల ఫారం-7 దరఖాస్తులను అధికంగా చేసినట్లు విమర్శలున్నాయి. తొలగింపులకు సంబంధించి క్షేత్రస్థాయిలో కొందరు బీఎల్వోలపైనా అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉంది. తమకు అనుకూలమైన ఓటర్లను తొగించవద్దని హెచ్చరిస్తున్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లపై ఇదే ఒత్తిడి పెడుతున్నారు. ఈనెల 22న తుది జాబితా విడుదల చేస్తున్న నేపథ్యంలో ఈసారైనా తప్పుల్లేకుండా యంత్రాంగం స్వచ్ఛమైన జాబితా విడుదల చేస్తుందా అన్న ఆందోళన ప్రతిపక్ష పార్టీల్లో నెలకొంది.

తిరస్కరణ వెనుక మతలబు ఏంటి?

గతేడాది అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో 1561 పోలింగ్ కేంద్రాల పరిధిలో 13,67,110 ఓట్లు నమోదై ఉన్నాయి. ఇందులో పురుషులు 6,85,239, మహిళలు 681810, ఇతరులు 61 మంది ఉన్నట్లు ప్రకటించారు. జనవరి నుంచి అక్టోబరు 16 దాకా 23798 మంది కొత్త ఓటర్లు పెరిగారు. ఈ జాబితాలో చేర్పులుమార్పులు, నూతన ఓట్లు కలిపి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఇప్పటివరకు వేలాది దరఖాస్తులు వచ్చాయి. 2022 డిసెంబరు 26 నుంచి 2023 డిసెంబరు 10వ తేదీదాకా ఆరు నియోజకవర్గాల నుంచి ఫారం-6 కింద 92035 ఫిర్యాదులు స్వీకరించగా.. 81808 పరిష్కరించి, 10227 తిరస్కరించారు. ఫారం-7 కింద 62227 దరఖాస్తులు రాగా.. 48550 పరిష్కరించగా 13660 తిరస్కరించి 15 దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టారు. ఫారం-8 కింద 60660 దరఖాస్తులు స్వీకరించగా.. 57349 దాకా పరిష్కరించగా.. 3311 తిరస్కరించారు. బీఎల్వోలపై అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఫారం-6, 7 కింద దరఖాస్తుల తిరస్కరణలో ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించి, అధికార పార్టీ వారి అనుకూల ఓటర్ల జాబితాలో ఇంకా ఉంచినట్లు తెలుస్తోంది.

ఏం చెప్పాలి?

ఓటర్ల జాబితాలో గుర్తించిన తప్పులను చక్కదిద్ది స్వచ్ఛ జాబితా రూపకల్పనలో ఎడతెగని జాప్యం కొనసాగుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపు పరిష్కరించి, జాబితాను సరిదిద్దాలని ఉన్నతాధికారులు ప్రతి వారం సమీక్షలు నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని హెచ్చరిస్తూ వస్తున్నారు. పరిష్కారమైన అర్జీలకు సంబంధించి ఆయా పార్టీలతో సమీక్షలు నిర్వహించినా. సమాచారం సక్రమంగా అందించలేకపోతున్నారు. జిల్లాలో అధికార పక్షం.. యంత్రాంగాన్ని చెప్పుచేతుల్లో పెట్టుకుని, ఒత్తిళ్లు పెట్టి భారీ ఎత్తున దొంగ ఓట్ల దరఖాస్తులను ఆమోదిస్తూ చేర్పిస్తున్నారనీ, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు గతేడాది నవంబరు 30న టీడీపీ జిల్లా నేతలు ఫిర్యాదు చేశారు. ఆయా నియోజక వర్గాల వారీగా వేల సంఖ్యలో బోగస్ ఓట్లు, మరణించిన, పర్మనెంట్‌గా వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీ ఓటర్లు జాబితాలో అలాగే కొనసాగుతున్నాయని ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై అధికార యంత్రాంగంతో అధికార పక్షం తప్పిదాలు చేయిస్తోందనీ, సరైన దిశలో ఎన్నికల ప్రక్రియ కొనసాగాలని టీడీపీ డిమాండ్ చేశారు. జిల్లా నుంచి కర్ణాటకకు వలస వెళ్లిన వారే ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి వారికి స్వగ్రామాలతోపాటు వసల వెళ్లిన ప్రాంతాల్లోనూ ఓట్లు ఉన్నాయి. వీరి ఓట్ల తొలగింపునకు గ్రామాలకు వెళ్లిన బీఎల్వోలకు సరైన సమాచారం, డిక్లరేషన్ ప్రతంపై సంతాకాలు చేసే వారు అందుబాటులో ఉండడం లేదు. ఈనేపథ్యంలో డబుల్ ఎంట్రీలు తొలగించేందుకు ఇబ్బంది పడాల్సివస్తోంది. ఫారం-6 కింద అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. ఇంటర్నెట్ ద్వారా అధికంగా రాగా.. వీటిలో చాలావరకు తప్పులు దొర్లడంతో విచారణ ఇబ్బందిగా మారింది. ఫారం-7 కింద దరఖాస్తులు చేయడం అంటే ఓటరే స్వచ్ఛందంగా తన ఓటు హక్కు తొలగించాలని కోరడం. ఇందుకు నేరుగా బీఎల్‌ఓలకు ఫారం-7 ఇవ్వడంగానీ, ఆన్‌లైన్‌లోగానీ దరఖాస్తు చేస్తారు. మృతిచెందిన వారి ఓటు తొలగించాలని ఆ కుటుంబ సభ్యులు దరఖాస్తు చేయాలంటే మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. సామాన్యులు ఎవరూ దీనిపై పెద్దగా దృష్టి పెట్టడంలేదు. గత నెలలో సీఈసీ బృందం రాష్ట్రానికి వచ్చి రెండు రోజులపాటు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్, ఎస్పీతో సమీక్ష చేసి ఎన్నికల నిర్వహణ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. ఓటరు జాబితా పురోగతిపై ప్రశ్నించారు. ధర్మవరం నియోజక వర్గంలో టీడీపీ సానుభూతిపరులే లక్ష్యంగా ఫారం-7 దరఖాస్తులు చేయించారు. తప్పుడు చిరునామాలతో బోగస్ ఓట్లు నమోదయ్యాయి. వాటిని తొలగించాలని టీడీపీ నేతలు.. బీఎల్వోలకు ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అత్యధికంగా డబుల్ ఎంట్రీలు, మరణించి వారి ఓట్లు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిని పరిష్కారించారా.. అలాగే ఉంచారా అన్న ఆందోళన నెలకొంది. తాజాగా రెండు రోజుల పాటు కేంద్ర ఎన్నికల బృందం రాష్ట్రంలో రెండ్రోజులు పర్యటించనుంది. మంగళ, బుధవారాల్లో విజయవాడలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష చేయనుంది. సమీక్షలో ఏం చెప్పాలన్న టెన్షన్ యంత్రాంగంలో నెలకొంది.

విపక్ష ఓటర్లపై వైసీపీ గురి



రాష్ట్రవ్యాప్తంగా అధికార పార్టీ.. తీవ్ర ప్రజావ్యతిరేకను మూటగట్టుకుంది. మళ్లీ ఓటు వేస్తారో.. లేదోనన్న భయం వైసీపీని వెంటాడుతోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలిచేందుకు అధికార పార్టీ నేతలు కుట్రలు మొదలు పెట్టి విపక్ష ఓటర్లపై కన్నేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. టీడీపీ సానుభూతి ఓటర్లను తొలగించి, వైసీపీ అనుకూలమైన వారిని జాబితాలో ఉండేలా బీఎల్వోలపై ఒత్తిడి పెట్టిన సంగతి తెలిసిందే. గతంలో ఆన్‌లైన్ వేదికగా ఫలానా ఓటరు చనిపోయినట్లు జాబితాలో పేర్లను తొలగించాలని వెల్లువలా దరఖాస్తులు సమర్పించారు. బీఎల్‌ఓలపై ఒత్తిళ్లు చేసి దొంగ ఓట్లు నమోదు చేయించారు. అధికార పార్టీ కుట్రలను గుర్తించిన టీడీపీ నేతలు జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటరు జాబితాలో అవకతవకలపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘంతో పాటు జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ముసాయిదా ఓటర్ల జాబితాలో వందశాతం తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించడంలో భాగంగా అభ్యంతరాల స్వీకరణకు డిసెంబరు 2, 3 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఇందులో చేర్పులు, తొలగింపులు, ఓటర్ల నమోదుపై ప్రతి పోలింగ్ కేంద్రంలో తప్పని సరిగా అభ్యర్థనలు, కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల వివరాలను బీఎల్‌ఓలు రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పరిశీలకుడు మురళీధర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 40 నుంచి వందదాకా మృతుల ఓట్లు తొలగించాలంటూ దరఖాస్తులు వచ్చాయి. అనుమానిత ఓటర్లతోపాటు ఒక్కో వ్యక్తికి రెండు, మూడుచోట్ల నమోదు చేసిన ఉదంతాలు అనేకం వెలుగు చూశాయి. ఈనేపథ్యంలో అధికార పార్టీ ఒత్తిళ్లను దాటి స్వచ్ఛ ఓటర్ల జాబితా రూపొందించడం ఏమేరకు సాధ్యమన్న చర్చకు తెరలేపుతోంది.

రాష్ట్రంలో టీడీపీ గాలి వీస్తోంది..

కష్టపడి పనిచేసి.. ఫలితం ప్రజలకిద్దాం..

నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే బాలకృష్ణ



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, జనవరి 8: రాష్ట్రమంతా తెలుగుదేశం పార్టీ గాలి వీస్తోందని సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. స్థానిక జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం హిందూపురం రూరల్ మండలంలో టీడీపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలతో పంచాయతీల వారీగా సమీక్ష నిర్వహించారు. కగ్గల్లు పంచాయతీతో మొదలుపెట్టి రాత్రి 8 గంటలు దాటే వరకు సమీక్ష జరిపారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలన్నారు. అప్పుడు ఫలితం ప్రజలకు అందిద్దామన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధిని, వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, అక్రమ కేసులపై ప్రజలకు వివరించాలన్నారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. టీడీపీ ఎప్పుడు అధికారంలోకి వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు పనితీరు ఏమిటో ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, కార్యకర్తల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్యకర్తను దగ్గరకు తీసుకుని వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఉదయం నుంచి రాత్రి వరకు 14 పంచాయతీలకు సంబంధించి 3 వేలకుపైగా నాయకులు, కార్యకర్తలను కలిశారు. మండల కన్వీనర్ తప్ప.. ఇతర ముఖ్య నాయకులను ఎవరినీ సమీక్షలో పెట్టుకోకుండా నేరుగా ప్రతి కార్యకర్త నుంచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు కొల్లకుంట అంజినప్ప, రామాంజినమ్మ, వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణాచలరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు ప్లాన్ ఫ్లాప్...

- ఏకతాటిపైకి అంటూ సమావేశాలు
- సొంత పార్టీ కార్యకర్తలు రాకపోవడంతో మహిళా సంఘాలు, కార్మికులతో మమ
- మంత్రి సమావేశానికి రాకపోతే ఆసరా, పింఛన్ రాదంటూ ప్రచారం

హిందూపురం, జనవరి 8: నియోజకవర్గంలో అధికార పార్టీలో నెలకొన్న విభేదాలు, అసమ్మతి సెగలు తగ్గలేదు. ఇన్‌చార్జిలను మార్చితే ఫలితం ఉంటుందని పార్టీలో పెద్దాయన భావించాడు. ఇక్కడ అప్పట్లో అసమ్మతి నాయకుల కోరిక మేరకు అప్పటి ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఇక్బాల్‌ని తప్పించి, మంత్రికి సన్నిహితంగా ఉండే వేణురెడ్డి సతీమణి దీపికను ఐదు నెలల క్రితం సమన్వయకర్తగా నియమింపజేశారు. ఇక పురంలో అధికార పార్టీకి అడ్డు ఉండదనీ, కంచుకోటను బద్దలు కొడతామని ప్రస్తుత సమన్వయకర్త వర్గీయులు పేర్కొన్నారు. కంచుకోట బద్దలు కొట్టడం పక్కన పెడితే సొంత పార్టీలో గతం కంటే అసమ్మతి పోరు, వర్గపోరు అధికమయ్యాయని ఆ పార్టీ నాయకులే చెప్పుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికలు దగ్గర పడుతుండటంతో నియోజకవర్గంలో వర్గపోరు లేకుండా చేసి, అసమ్మతికి చెక్‌పెట్టాలని మంత్రి భావించారు. ఇందులో భాగంగా పంచాయతీల వారీగా సమావేశాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి పంచాయతీలోని జనంలో 70 శాతం మంది సమావేశాలకు వచ్చేలా చిత్తూరు నుంచి వచ్చిన మంత్రి వేగులు ప్లాన్ వేశారు. సోమవారం ప్రారంభమైన పంచాయతీల సమావేశాలకు సొంత పార్టీ కార్యకర్తలే రాకపోవడం గమనార్హం. నెల రోజులుగా మంత్రి పర్యటనపై విస్తృతంగా ప్రచారం చేశారు. అధికార పార్టీలోని కొంతమంది నాయకులను బెదిరించి, మంత్రి వచ్చినపుడు జనాలను తరలించాలనీ, ఎవ్వరూ నోరు మెదపరాదని చిత్తూరు నుంచి వచ్చిన మనుషులు ఆదేశించారు. దీంతో సోమవారం జరిగిన పంచాయతీల వారీ సమావేశాలకు చౌళూరు మినహా అన్ని పంచాయతీల్లో జనాలు రాక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి.



మంత్రి సమావేశానికి జనం రాక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఏకతాటిపైకి అంటూ..

సొంత పార్టీలో నెలకొన్న విభేధాలు, అసమ్మతిని చెక్‌పెట్టి, అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు సమావేశాలు నిర్వహిస్తామని ముందుగా చెప్పారు. పంచాయతీల వారీగా నిర్వహించిన సమావేశాలను బట్టి చూస్తే అలాంటివేవీ కనిపించడంలేదు. ప్రతిపక్షాలను విమర్శించడం, ముఖ్యమంత్రిని పొగడడంతోనే సమావేశాలు ముగిశాయి. సోమవారం చౌళూరు మినహా సంతేబిదనూరు, తూముకుంట, గోళ్లాపురం, సంతేబిదనూరు, కొటిపి, బేవనహళ్లి పంచాయతీల్లో వర్గపోరు, అసమ్మతి పోరు అధికంగా ఉంది. కిరికెర, బేవనహళ్లి, కొటిపికి చెందిన కొందరు నాయకులు.. సమన్వయకర్తపై మంత్రికి ఫిర్యాదులు చేశారు. వారిని చక్కదిద్దే పనితోపాటు ఏకతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం.

మహిళా సంఘాలు, కార్మికులతో సరి

వైసీపీ అధికారంలో ఉంది. పంచాయతీ వార్డు సభ్యులతో మొదలుకొని స్థానికంగా అధికార పార్టీదే పైచేయి. అలాంటపుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలు స్వచ్ఛందగా సమావేశాలకు రావడం సహజం. సొంత పార్టీ కార్యకర్తలు, సంక్షేమ పథకాలు తీసుకున్న వారు రామ్‌రామ్ అనడంతో చేసేదిలేక మంత్రి సమావేశాలకు మహిళా సంఘాల సభ్యులను తరలించారు. పింఛన్ ఇస్తామని వారిని సమావేశాలకు రప్పించినట్లు తెలిసింది. అప్పటికీ జనం కనిపించకపోవడంతో మహిళా కార్మికులను పరిశ్రమలకు చెందిన బస్సుల్లో సమావేశాలకు తరలించడం తీవ్ర దుమారం లేపింది. హిందూపురం మండలంలో జనాభా పరంగా పెద్దదైన కిరికెర పంచాయతీలో జనం రాక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఈ పంచాయతీలో 10 వేల మంది జనాభా ఉన్నారు. రెండు ఎంపీటీసీ స్థానాలు, సర్పంచ్ కూడా అధికార పార్టీ మద్దతుదారులే దక్కించుకున్నారు. అలాంటి చోట ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడం ఆ పార్టీ నేతల్లో ఆందోళన రేపింది.

చౌళూరుకే పరిమితమైన ఎంపీపీ

హిందూపురం ఎంపీపీగా దళిత వర్గానికి చెందిన రత్నమ్మ ఉన్నారు. ఆమె సొంత గ్రామం చౌళూరు కావడంతో అక్కడ మాత్రమే పాల్గొన్నారు. ఆ తరువాత మరిచిపోయారు. మండల అధ్యక్షురాలు తప్పనిసరిగా ఏ పంచాయతీలో కార్యక్రమం జరిగినా పాల్గొంటారు. అధికార పార్టీకే చెందిన ఆమెను పక్క పంచాయితీలకు పిలవకపోవడం దళితుల పట్ల వైసీపీ నాయకులకు ఉన్న అభిమానాన్ని తెలియజేస్తుంది.

రూ.కోటి అదనపు భారం

మంత్రి సమావేశాలకు కార్మికులను తరలించడంతో మరమ్మతుల పేరుతో 5 గంటల సమయం విద్యుత్ సరఫరా తీసేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విద్యుత్ శాఖ మంత్రి కావడంతో జిల్లా ఉన్నతాధికారులు కూడా ఆయన వెంటే ఉన్నారు. కార్మికులు సమావేశాలకు రాకపోవడంతో పారిశ్రామిక వాడకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కొన్ని పరిశ్రమలు జనరేటర్ సాయంతో ప్రారంభించారు. దీంతో పరిశ్రమలకు రూ.కోటి అదనపు భారం పడినట్లు ఓ పరిశ్రమ యజమాని పేర్కొన్నారు.

ఆ రెండు వర్గాలు ఎక్కడ..?

విభేదాలకు చెక్‌పెట్టేందుకు వచ్చిన మంత్రి సమావేశాల్లో ఆ రెండు వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నట్లు లేదు. ప్రతి గ్రామంలో ఇద్దరు ముఖ్యనేతల అనుచరుల వర్గం ఉంది. మంత్రి సమావేశానికి ఈ రెండువర్గాల నాయకులు వెళ్లలేదు. దీనినిబట్టి స్థానిక సమన్వయకర్తపై ఆ రెండు వర్గాలు వ్యతిరేకిస్తున్నట్లు బహిర్గతమవుతోంది.



బోర్లా పడుకుని దండం పెడుతూ మున్సిపల్ కార్మికుల నిరసన

ఈ ప్రభుత్వానికి దండాలు..

మున్సిపల్ కార్మికుల నిరసన

కలెక్టరేట్ ముందు బోర్లా పడుకుని, దండాలు పెడుతూ ఆందోళన



కదిరిలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పుట్టపర్తి, జనవరి 8: ఈ ప్రభుత్వానికి దండాలు అంటూ మున్సిపల్ కార్మికులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వారు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలోని మున్సిపల్ కార్మికులు.. కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే రోడ్డుపై బైఠాయించారు. బోర్లా పడుకుని, దండాలు పెడుతూ నిరసన తెలిపారు. కార్మిక నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండివైఖరి వీడి తమ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కదిరిలో మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి కాలేజీ సర్కిల్ వరకు అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ చేశారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు.

సీఎం జగన్‌ది కుంభకర్ణుడి నిద్ర

- అంగన్‌వాడీల మండిపాటు
- కుంభకర్ణ విగ్రహానికి వినతి
- 28వ రోజుకు చేరిన సమ్మె



కుంభకర్ణ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు

పుట్టపర్తి రూరల్/ పెనుకొండ, జనవరి 8: సమస్యల పరిష్కారం కోరుతూ తాము 28 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్.. కుంభకర్ణుడిలా మొద్దునిద్ర చేస్తున్నాడని అంగన్‌వాడీలు మండిపడ్డారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె సోమవారం 28వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా నిరసనలు కొనసాగించారు. పెనుకొండ సమీపంలోని కుంభకర్ణ విగ్రహానికి అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. నాలుగున్నరేళ్లుగా కుంభకర్ణ విగ్రహంలా జగన్మోహన్ రెడ్డి నిద్రపోతున్నారనీ, అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి మొగ్గు చూపడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో పుట్టపర్తిలోని ఆర్డీఓ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్ష కొనసాగించారు. చిలమత్తూరులో హరికథ చెబుతూ నిరసన వ్యక్తం చేశారు. లేపాక్షిలో దీక్షలకు రైతులు మద్దతు పలికారు. నల్లమాడలో దండాలు పెడుతూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి

- సమగ్రశిక్ష ఉద్యోగుల మండిపాటు
- 20వ రోజుకు చేరిన సమ్మె



సమ్మెలో మాట్లాడుతున్న జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి

పుట్టపర్తిరూరల్, జనవరి 8: తమ పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని సమగ్రశిక్ష ఉద్యోగులు మండిపడ్డారు. సమస్యల పరిష్కారం కోరుతూ వారు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 20వరోజుకు చేరుకుంది. సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు పెద్దఎత్తున పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ.. సమగ్రశిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందనీ, ఇప్పటికైనా మొండివైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న, రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు చంద్రశేఖర్, నాగరాజు, ఓబులేసు, బాబ్‌జాన్, హరిప్రసాద్, భవాని, స్రవంతి, ఈశ్వరి, భాగ్యమ్మ, ఆనంద్, రాజశేఖర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

కొత్తచెరువు, జనవరి 8: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మంగళవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈఓ మీనాక్షి ప్రకటనలో తెలిపారు. మిషనరీ పాఠశాలలకు 10 నుంచి 18వ తేదీ వరకు సెలవులు ఉంటాయన్నారు. ఈ మేరకు పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

జిల్లాలో 26 మంది ఎస్ఐల బదిలీ

పుట్టపర్తిరూరల్, జనవరి 8: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పెద్దఎత్తున్న ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో పనిచేస్తున్న 26 మంది ఎస్ఐలను తిరుపతి జిల్లాకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐలలో శేషగిరి, వెంకటనారాయణ, వెంకటరాముడు, రామచంద్రయ్య, ఇక్బాల్, మహమ్మద్ రఫీ, ఇక్బాల్ బాషా, హనుమంతరెడ్డి, బాబు, లక్ష్మీనారాయణ, జయరామప్ప, భాస్కర్‌ప్రసాద్ రాజు, కేఎల్ కళావతి, అబ్దుల్ కలాం అజాద్, ఎస్ మహమ్మద్ రఫీ, రెడ్డెప్ప, వెంకటరమణ, అంజనేయప్రసాద్, శివశంకర్, బీ. తులసన్న, బాలరాజు, శ్రీరాములు, జీ. వెంకటరమణ, రఫీక్, శ్రీనివాసులు, దాదాపీర్ ఉన్నారు.

గడ్డం సుబ్బుకు టీడీపీలో పెద్దపీట..!

- రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియామకం
- పార్టీ ఆవిర్భావం నుంచే క్రియాశీలక రాజకీయాల్లోకి..
- తెలుగు విద్యార్థిగా ప్రస్థానం



అనంతపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తూ వస్తున్న గడ్డం సుబ్రమణ్యంకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పెద్దపీట వేసింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆయనను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. తెలుగు విద్యార్థి విభాగంలో పనిచేయడంతో 1985లో తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఏడాది తిరక్కుండానే తెలుగు విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన పనితీరు గుర్తించి 1990లో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఆ తర్వాత 1994లో రాష్ట్ర యువత కమిటీలోకి తీసుకున్నారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయనకు అవకాశం ఇచ్చారు. అలా టీడీపీలో విద్యార్థి, యువత విభాగాల్లో పనిచేసిన సుబ్రమణ్యంను పార్టీ కమిటీలో పెద్దపీట వేశారు. ఏకంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచే చురుకైన కార్యకర్తగా, నాయకుడిగా పనిచేస్తుండటంతో అటు నందమూరి, ఇటు నారా కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. మరోవైపు జిల్లాలో పరిటాల రవీంద్రతో గడ్డం సుబ్బుది విడదీయరాని బంధం. ఎన్టీఆర్ భర్తరఫ్ సమయంలోనూ జరిగిన అల్లర్లలో సుబ్రమణ్యం సబ్ జైలుకు వెళ్లి వచ్చాడు. పరిటాల రవీంద్ర హత్యానంతరం జరిగిన అల్లర్లలోనూ అప్పటి ప్రభుత్వం సుబ్రమణ్యంను ప్రధాన నిందితుడిగా చేర్చి జైలుకు పంపింది. ఈ క్రమంలోనే ఆయనకు పార్టీ అధిష్ఠానం రాష్ట్ర కమిటీలో చోటు కల్పించింది. కమిటీలో చోటు కల్పించినందుకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, అధ్యక్షుడు అచ్చెన్నాయుడులకు సుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు.

నీరు వదలకపోతే.. మీ ఉద్యోగాలు ఊడుతాయ్!

- శ్రీరామిరెడ్డి కార్మికులను హెచ్చరించిన ఈఈ
- కార్మికులతో చర్చలు విఫలం



కార్మికులతో చర్చలు జరుపుతున్న అధికారులు

కళ్యాణదుర్గం, జనవరి 8: 'నీరు వదలకపోతే... మీ ఉద్యోగాలు ఊడుతాయ్' అని శ్రీరామిరెడ్డి కార్మికులను ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జవహర్ కుమార్, డీఈ శ్రీనివాసులు, జేఈ లావణ్య హెచ్చరించారు. సోమవారం పట్టణ సమీపంలో ఉన్న శ్రీరామిరెడ్డి పంప్‌హౌస్ వద్ద కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మె వద్దకు అధికారులు బృందంగా వచ్చి రెండు గంటల పాటు చర్చలు జరిపారు. 'మొదట నీరు వదలండి, లేకపోతే ఉద్యోగాలు ఊడుతాయ్... మీ ఇష్టం' అంటూ బెదిరింపులకు దిగారు. కార్మికులు మాత్రం భయపడేది లేదని, తమ జీతాలు, పీఎఫ్‌లు ఇవ్వాలని పట్టుబట్టారు. ఫేస్-1లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇచ్చారని, ఫేస్-4లో కార్మికులకు జీతాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ఫేస్-4 కింద సుమారు 225 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా పోషించుకోవాలని అన్నారు. ఎన్నిరోజులైనా ఇలానే సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్మికులను బెదిరిస్తున్నారని సీఐటీయూ నాయకులకు సమాచారం అందించడంతో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు రాజ్‌మోహన్, జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ వచ్చి అధికారులతో చర్చలు జరిపారు. చర్చలు విఫలం అయ్యాయి. జీతాలు ఇస్తేనే, నీరు వదులుతామంటూ కార్మికులు తేల్చిచెప్పారు. అధికారులు చేసేదేమీ లేక ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందిస్తామని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

విజయవాడకు కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, జనవరి 8: ఓటర్ల ఫిర్యాదులు, ముసాయిదా ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యలపై మంగళవారం విజయవాడలో కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ బృందం అన్నిజిల్లాల కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్షకు హాజరయ్యేందుకు కలెక్టర్ గౌతమి సోమవారం విజయవాడకు బయలుదేరారు. జిల్లా ఓటర్ల పరిస్థితి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించిన రికార్డులను ఆమె వెంట తీసుకెళ్లారు. జిల్లా ఎస్పీ కూడా వెళ్లినట్లు తెలిసింది. రెండురోజుల పాటు విజయవాడలో ఓటర్ల సమీక్షలో వీరు పాల్గొంటారు.

డెంగీతో విద్యార్థిని మృతి



సంధ్య (ఫైల్)

కణేకల్లు, జనవరి 8: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కురుబ సంధ్య(15) అనే పదో తరగతి విద్యార్థిని డెంగీ జ్వరంతో మృతి చెందింది. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సంధ్య పదిరోజుల క్రితం జ్వరంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ప్రకాష్, రత్నమ్మ బళ్లారిలోని ఓపీడీ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలిక ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విద్యార్థిని మృతి పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సంతాపాన్ని తెలిపారు.

పోలీసుల హత్య కేసులో
మాజీ నక్సలైట్లు జైలుకు తరలింపు

పావగడ, జనవరి 8: పావగడ సరిహద్దు ప్రాంతం వెంకటమ్మనహళ్లి గ్రామంలో 2005 ఫిబ్రవరి 10వ తేదీన మావోయిస్టులు ఆరుగురు పోలీసులు, ఒక పౌరుడిని దారుణంగా కాల్చి చంపిన ఘటనలో ఐదుగురు మాజీ నక్సలైట్లను పావగడ పోలీసులు విచారణ చేపట్టి సోమవారం జైలుకు తరలించారు. కనగానపల్లి మండలానికి చెందిన గంతమర్రి నాగరాజు, తల్లిమడుగు రామ్మోహన్, ఓబులేసు, కోనేటిపాళ్యం అంజి, కోనాపురం పద్మలను గత శనివారం రాత్రి వెంకటమ్మనహళ్లి ఘటనకు సంబంధించి పావగడ పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో మధుగిరి డీఎస్పీ రామచంద్రప్ప, ఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో పూర్తి విచారణ చేపట్టిన అనంతరం పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి మున్సిఫ్ కోర్టులో హాజరు పరిచారు. 15 రోజులపాటు రిమాండ్‌కు తరలించేందుకు న్యాయాధికారులు ఆదేశించారు. వెంకటమ్మనహళ్లి ఘటనకు సంబంధించి పావగడ పోలీసులు అరెస్టు చేసిన రామ్మోహన్, నాగరాజు, ఓబులేసు, అంజి, పద్మ, వీరందరూ 2005 సంవత్సరానికి మునుపే పోలీసుల ఎదుట లొంగిపోయి ప్రభుత్వం నుంచి పలు సౌకర్యాలు పొందారని, అయినా కూడా 2005లో జరిగిన ఘటనలో వారిని ఇరికించడం దారుణం అని వారి బంధువులు ఆరోపించారు.

నమ్మినవాళ్లను మోసగించావ్

ఎమ్మెల్యే కాపుపై బంధువు మండిపాటు

రాయదుర్గం, జనవరి 8: 'ఎమ్మెల్యే అయ్యాక నమ్ముకున్నవాళ్లని మోసం చేశావ్. ఇసుక, మద్యం, డీజిల్‌ను అమ్మి దోచుకున్నావు' అని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై ఆయన తోడల్లుడు హంపారెడ్డి తనయుడు నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రాయదుర్గంలోని తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టిక్కెట్ ఇవ్వలేదన్న ఆక్రోశంతో సీఎం జగన్‌పై తీవ్ర విమర్శలు చేసిన కాపు, నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. '2009లో రాయదుర్గానికి కొత్తగా వచ్చినపుడు నీకు ఆశ్రయం ఇచ్చి చేరదీస్తే.. మమ్మల్నే గొంతు కోసిన ఘనుడవి నువ్వు' అని విమర్శించారు. '2019లో జగన్ టిక్కెట్ ఇచ్చి గెలిపిస్తే, కొద్దిరోజులకే కర్ణాటకకు టిప్పర్లతో ఇసుకను రవాణా చేసి అడ్డంగా దొరికావు. వాటిని విడిపించుకునేందుకు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగావు. ఎస్‌ఐని క్షోభకు గురిచేశావు. గెలిచినప్పటి నుంచి దోచుకోవడం మీదే దృష్టి పెట్టి.. కర్ణాటక నుంచి ఆర్టీసీకి డీజిల్‌ను కూడా అక్రమంగా సరఫరా చేశావు. చెప్పుకుంటూ పోతే నీ చిట్టా చాలా ఉంది' అని విమర్శించారు. 'నీకు టిక్కెట్ రానందుకు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు సంతోష పడుతున్నారు. జగన్‌ను పొగడుతున్నారు. నువ్వు చేసిన వసూళ్లు, అక్రమాలు ఒక్కొక్కటిగా సీఎం జగన్ నీ ముందు చెబుతుంటే తలదించుకున్న మాట వాస్తవమా కాదా? నీ మనస్సాక్షికి సమాధానం చెప్పుకో..' అని అన్నారు. 'పార్టీ గొంతు కోసిందని చెబుతున్న నువ్వు.. ఇక్కడ అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎంతమంది జీవితాలను నాశనం చేశావో ఎవరిని అడిగినా చెబుతారు. ఇంకోసారి జగన్ గురించి మాట్లాడితే పూర్తి చిట్టా విప్పి జనం ముందు పెడతాం' అని హెచ్చరించారు.

చేనేత బతికితేనే ధర్మవరం బతుకుతుంది

- సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమను కాపాడుతా
- అరాచకాలకు అడ్డుకట్టవేసి ధర్మవరాన్ని ప్రశాంతంగా ఉంచుతా
- పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో పరిటాల శ్రీరామ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జనవరి 8: చేనేత బతికితేనే ధర్మవరం బతుకుతుందనీ, లేదంటే తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలో ఐదు రోజులుగా చేపట్టిన పాదయాత్ర సోమవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంలో ఏ కాలనీలో చూసినా సమస్యలే కనిపించాయన్నారు. వార్డులోని ఒకటిరెండు వీధుల్లోనే అన్ని సమస్యలు వచ్చాయంటే, వార్డు మొత్తం చూస్తే ఇంకెన్ని ఉంటాయో అర్థమవుతోందని అన్నారు. గుడ్ మార్నింగ్ అంటే ఏదో మంచి జరుగుతుందన్న అభిప్రాయం బయట సమాజంలో ఉందని, వాస్తవ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోతే ఇక గుడ్‌మార్నింగ్ కార్యక్రమం ఎందుకని ఎమ్మెల్యే కేతిరెడ్డిని ఆయన ప్రశ్నించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాను దగ్గరనుంచి చూశానని,



సభకు హాజరైన జనం

కొంతమంది కార్మికులు తినడానికి తిండిలేదని చెప్పడం తనను కలిచివేసిందని అన్నారు. హ్యాండ్‌లూమ్ ద్వారా నేసే చీరలకు వ్యాపారం బాగుండేలా, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేలా ఒక కార్యక్రమానికి శ్రీకారం చుడతానని శ్రీరామ్ అన్నారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో కేతిరెడ్డి జోలెపట్టి కార్మికుల కోసం భిక్షాటన చేశారని, ఆ జోలెకు రంధ్రం పడిన విషయం అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. తాను అలా చేసే పరిస్థితి ఉండదని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల పిల్లలను ఆదుకునే విధంగా ఒక కమిటిని వేస్తానని తెలిపారు. ధర్మవరం ప్రాంతంలో మహిళలకు ఎక్కువమందికి ఉపాధి లేకుండా పోయిందని, వారికి గార్మెంట్స్ పరిశ్రమలు కూడా తీసుకొస్తానని హామీ ఇచ్చారు. చేనేత కార్మికులను బెదిరించి, వారిని రాజకీయాల్లోకి లాగుతున్నారని, ఒక పద్ధతి ప్రకారం కార్పొరేట్ దందా సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యే అయ్యాక రాజకీయాలను రాజకీయాలుగా మాత్రమే చూస్తానని, వ్యాపారులను ఇబ్బంది పెట్టనని అన్నారు. పాదయాత్రలో తాను ముందు వెళ్తుంటే వెనక వైపు నుంచి కొందరు వైసీపీ వారు, నేర ప్రవృత్తి ఉన్న వారు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ధర్మవరంలో అరాచకాలకు ముగింపు పలుకుతానని, ఇన్ని రోజులు సాగించిన దందాలు ఇక ఉండబోవని ఆయన హామీ ఇచ్చారు.

ముస్లింలకు జగన్ తీరని ద్రోహం

- ఎన్నికల్లో ముస్లింల ఓట్లే నిర్ణయాత్మకం
- శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్



ముస్లిం ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న ఎంఏ షరీఫ్

గుంతకల్లు, జనవరి 8: మైనార్టీల ప్రభుత్వం అంటూ మోసకారి మాటలు పలికి అధికారంలోకి వచ్చిన జగన్ ముస్లింలకు తీరని ద్రోహం చేశాడని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. సోమవారం ఉదయం గుంతకల్లులో నిర్వహించిన నియోజకవర్గ ముస్లిం ఆత్మీయ సదస్సుకు షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే దుల్హన్ పథకాన్ని నీరుగార్చారన్నారు. ఇతర సంక్షేమ పథకాలన్నింటినీ చాపచుట్టేసి ముస్లింలకు తీరని అన్యాయం చేశారన్నారు. ముస్లిం హక్కులకు భంగం కలిగించిన ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, తదితర చట్టాల విషయంగా బీజేపీ అడుగులకు జగన్ మడుగులొత్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ముస్లింలు వైసీపీకి వ్యతిరేకంగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముస్లింలు 50 నియోజకవర్గాల్లో, 8 పార్లమెంటు స్థానాల్లో తమ ప్రభావాన్ని చూపగలరన్నారు. టీడీపీ హయాంలో 36 వేల మందికి దుల్హన్ పథకాన్ని వర్తింపజేయగా, జగన్ కేవలం 3 వేల మందికి రూ.50 వేల ఆర్థికసాయం ఇచ్చారన్నారు. దుల్హన్ స్కీంను రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతానని హామీ ఇచ్చి తుంగలో తొక్కారన్నారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చి, చివరకు మైనార్టీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా, నూర్ బాషా సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ షెక్షావలి, మైనార్టీ నేతలు సాలార్ బాషా, గౌస్ మోదిన్, పర్వీన్ తాజ్, కేసీ హరి, గుత్తి జిలాన్ బాషా, పామిడి గౌస్ పీరా, మహమ్మద్ షరీఫ్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ హామీలు 730.. అమలైంది 15 శాతమే..

- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



పుట్టపర్తి, జనవరి 8: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు 730 హామీలిచ్చి, అందులో కేవలం 15 శాతం హామీలు అమలు చేశారని మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో గొప్పలు చెప్పి, మడమ తిప్పాడని ఎద్దేవా చేశారు. మద్య నిషేధమంటూ తన ఐదేళ్ల పాలనలో రూ.36వేల కోట్లు జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది 5 లక్షల గృహాలని చెప్పి, కనీసం వేలల్లో కూడా పూర్తి చేయలేదన్నారు. 3,500మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతులను రైతు భరోసా పేరుతో ఆదుకున్నది శూన్యమన్నారు. 25మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వచ్చి ప్రత్యేక హోదా ఇస్తానని గొప్పలుచెప్పి, తన కేసులు మాఫీ కోసం తాను కేంద్రం ముందు మెడలు వంచారని ఏద్దేవా చేశారు. ఇసుక, సిమెంటు, నిత్యావసర వస్తువులు, కూరగాయాలు, చివరికి మద్యం ధరలు పెంచి సామాన్యులకు గుండిబండగా మారాడన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌తో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి గాలికొద్దిలేశారని చెప్పారు. చంద్రబాబు రూ.రెండువందల పింఛన్‌ను రెండువేలు చేస్తే, తాను రూ.3వేలు ఇస్తానని, మోసం చేసి, ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రూ.3 వేలు ఇచ్చి గొప్పలు చెబుకోవడంమాట తప్పడమే అన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పింఛన్ల పంపిణీలో సంస్కారం మరచి విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల పాలనలో రోడ్ల గుంతపూడ్చలేదు. గంప మట్టి వేయలేదు. 193 చెరువులకు హంద్రీనీవా నీటితో నింపుతామని చెప్పిన మాట ఏమైదని ప్రశ్నించారు. సమావేశంలో రామాంజనేయులు, జాకీర్ అహమ్మద్, దేవానంద రెడ్డి, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ పాల్గొన్నారు.

ఇది ప్రభుత్వ కుట్ర..!

- స్వాతంత్ర్య సమరయోధుడికి అవమానం
- రెడ్లే కాదు.. అన్నివర్గాల ప్రజలూ తిరగబడతారు
- జగన్ ప్రభుత్వానికి ఏపీ రెడ్డి సంఘం హెచ్చరిక
- ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణకు అడ్డంకులపై ఆగ్రహం

అనంతపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. ఈ పేరు తెలియని వారెవరూ ఉండరు. ఆయనో స్వాతంత్ర్య సమరయోధుడు. రెడ్డి సామాజికవర్గం ఆ మహనీయుడిని రియల్ హీరోగా చూస్తుంది. సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ ప్రభుత్వానికి చెమటలు పట్టించిన తెలుగువీరుడు ఉయ్యాలవాడ. అలాంటి మహనీయుడి కాంస్య విగ్రహాన్ని అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం నేతలు భావించారు. కాంస్య విగ్రహాన్ని తయారు చేయించారు. విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ముహూర్తం నిర్ణయించారు. కానీ విగ్రహావిష్కరణను పోలీసులు అడ్డుకున్నారు. దీని వెనుక ప్రభుత్వ ఆదేశాలున్నాయా..? అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు పనిచేశాయా..? అన్న చర్చ జరుగుతోంది. ఇది ప్రభుత్వ కుట్ర అని రాయలసీమ పోరాటసమితి కన్వీనర్, రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి సామాజికవర్గానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణకు రెడ్డి సామాజికవర్గం ప్రజాప్రతినిధులు రాకపోగా, పోలీసుల చేత విగ్రహావిష్కరణను అడ్డుకోవడం రెడ్డి జాతికే అవమానమని ఆయన అన్నారు. ఈ వ్యవహారం రెడ్డి సామాజికవర్గంలో ఆగ్రహానికి కారణమైంది. మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రభుత్వం, పోలీసులపై మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు రెడ్డి సంఘం నేతలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం దిగొచ్చి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా ఉంటేసరి, లేదంటే రాబోయే ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని హెచ్చరిస్తున్నారు.

నిరంకుశత్వానికి నిదర్శనం..



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడం సీఎం జగన్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను వీధుల్లో ఏర్పాటు చేయడాన్ని అడ్డుకోని పోలీసులు, ప్రభుత్వం.. స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహావిష్కరణకు అడ్డు చెప్పడం దారుణం. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణను అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నాం. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే... రెడ్డి సామాజికవర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజలు తిరగబడే రోజులు వస్తాయి. ఇది ఒక రెడ్డి సామాజికవర్గానికి చెందిన అంశం కాదు. దేశ ప్రజలకు సంబంధించిన అంశం.

- కేశవరెడ్డి, అనంతపురం

అవమానించడమే..



దేశ స్వాతంత్ర్య పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి. ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని రెండు నెలలుగా నగరంలో పనులు చేస్తున్నాం. ఇన్నాళ్లూ ప్రభుత్వం, పోలీసులు ఎటువంటి నోటీసు ఇవ్వలేదు. అన్ని రకాల అనుమతులు తీసుకుని ఉయ్యాలవాడ విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందులో దాపరికం, రహస్యం ఏమీ లేదు. రెండు నెలల కాలంలో స్పందించని పోలీసులు, విగ్రహావిష్కరణ రోజున మమ్మల్ని అరెస్టు చేసి, అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. విగ్రహావిష్కరణను అడ్డుకోవడం పట్ల అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణను అడ్డుకోవడమంటే ఆయనను అవమానించడమే.

- గంగులకుంట నరేష్‌కుమార్ రెడ్డి, ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

వివాదం చేయడం తగదు..



కుల, మత, రాజకీయాలు, వర్గాలకు అతీతంగా స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ చేపట్టాం. దీన్ని వివాదం చేయడం తగదు. ఎంతో మంది నాయకుల విగ్రహాల ఏర్పాటుకు లేని సమస్య ఉయ్యాలవాడ విగ్రహం ఏర్పాటుకే ఎందుకు వచ్చింది..? రాజకీయ నాయకులు, అధికారులు సమష్టిగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అలాకాకుండా విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు. రెండు మూడు నెలలుగా ఉయ్యాలవాడ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఏపీ రెడ్డి సంఘం నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం విగ్రహావిష్కరణ చేయాలని నిర్ణయించారు. ఇంతలో విగ్రహాన్ని ఆవిష్కరించకుండా వారించడం రెడ్డి సామాజికవర్గాన్నే కాదు.. అన్ని వర్గాల ప్రజలను బాధిస్తోంది.

- రాజశేఖర్‌రెడ్డి, ఏపీ రెడ్డిసంఘం నాయకుడు

దేవుడి భూమికే ఎసరు!

- అధికార పార్టీ నాయకుడి పేరిట ఆన్‌లైన్
- రీ సర్వేతో బట్టబయలు.. గ్రామస్థుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

కళ్యాణదుర్గం, జనవరి 8: అధికార పార్టీ నాయకుడు దేవుడి భూమికే ఎసరు పెట్టాడు. భూముల రీ సర్వేతో ఈ అక్రమాల తతంగం బయటకు పడడంతో గ్రామస్థులే అవాక్కయ్యారు. మా గ్రామ దేవుడి భూమిని కాపాడాలంటూ సోమవారం కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు బైఠాయించారు. మాకు న్యాయం కావాలి, మా దేవుడి భూమిని కాపాడాలంటూ నినాదాలు చేశారు. కంబదూరు మండల పరిధిలోని కె.కొత్తూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమికి సంబంధించి సర్వే నెంబర్ 304లో 3 ఎకరాల 57 సెంట్ల భూమిని ఈ గ్రామానికి ఓ వ్యక్తి అధికార దర్పాన్ని, రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఆక్రమించాడని గ్రామస్థులు ఆరోపించారు. అంతటితో ఆగకుండా వెబ్‌ల్యాండ్‌లోకి కూడా ఈ భూమిని తన పేరుమీద మార్చుకున్నాడని వాపోయారు. సబ్ డివిజన్ లేకున్నా అదనంగా అదే సర్వే నెంబర్‌కు మరొక లెటర్‌ను సృష్టించి భూమిని వెబ్‌ల్యాండ్‌లోకి ఎక్కించుకున్నారని తెలిపారు. ఇదంతా నెలరోజుల క్రితం గ్రామంలో రీసర్వే చేస్తున్నప్పుడు ఈ తతంగం బయటకు పడిందన్నారు. డిసెంబరు 18న కంబదూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట కూడా ఆందోళన చేశామన్నారు. తహసీల్దార్ నయాజ్ అహమ్మద్, ఆర్ఐ కిరణ్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వాపోయారు. వారు కూడా ఇంతవరకు న్యాయం చేయకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. ఆదివారం రాత్రి ఈ సమస్యపై గ్రామంలో దండోరా వేయించి, కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయానికి తరలిరావాలని పిలుపునివ్వాలని చూస్తే, దండోరా వేసే వ్యక్తినే అధికార పార్టీ నాయకులు భయపెట్టించారని ఆరోపించారు. దీంతో పక్క గ్రామమైన కర్తనపర్తి నుంచి దండోరా వేసే వ్యక్తిని పిలిపించి గ్రామంలో వేయించామన్నారు. అనంతరం సమస్యపై ఆర్డీవో రాణిసుష్మితకు వినతి పత్రం అందచేశారు. ఆర్డీవో స్పందించి గ్రామంలోకి వచ్చి విచారించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

- తీర్పు వెల్లడించిన జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, జనవరి 8: శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామ ఎస్సీ కాలనీలో జరిగిన పాలాకుల చిన్నచౌడయ్య అలియాస్ చౌడప్ప హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఈ మేరకు సోమవారం ఏ1 పాలాకుల సూర్యనారాయణ, ఏ2 పాలాకుల పెద్దన్న, ఏ3 పాలాకుల రామాంజనేయులు, ఏ5 పాలాకుల రామాంజినమ్మకు కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ముద్దాయిల తల్లి పాలాకుల సాలమ్మపై నేరం రుజువు కానందున ఆమెపై కేసు కొట్టివేశారు. కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం ఉల్లికల్లు గ్రామ ఎస్సీ కాలనీలో చిన్నచౌడప్పకు హత్య చేసిన ముద్దాయిలు సూర్యనారాయణ, పెద్దన్న, రామాంజనేయలు, రామాంజినమ్మ స్వయాన పెదనాన్న కుమారులు, కుమార్తె. సాలమ్మ.. మృతుడికి పెద్దమ్మ. ఎస్సీ కాలనీలోని మృతుని అన్న ఆదినారాయణ, ముద్దాయిల అక్క రామాంజినమ్మ ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇళ్ల దగ్గర ప్రతి చిన్న విషయానికి రామాంజినమ్మ, ఆదినారాయణ భార్య శ్యామలతో గొడవ పడేది. తరచూ ఇలా జరిగే క్రమంలో శింగనమల పోలీస్‌స్టేషన్‌లో ఇరుపక్షాలు కేసులు పెట్టుకున్నారు. 2018 ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి వద్ద పేడ అలుక్కనే విషయంలో రామాంజినమ్మ, శ్యామలతో గొడవ పడింది. శ్యామల, ఆమె భర్త నారాయణ.. రామాంజినమ్మను తిట్టాడు. అదే విషయాన్ని రామాంజినమ్మ తన తమ్ముళ్లయిన సూర్యనారాయణ, రామాంజనేయలు, పెద్దన్నకు తల్లి సాలమ్మ చెప్పి వాళ్లను ఏదో ఒకటి చేయకపోతే తాను అక్కడ ఉండలేనని తమ్ముళ్లను, అమ్మను రెచ్చగొట్టింది. 7 గంటల సమయంలో వారందరూ కొడవండ్లు, కట్టె, రోకలిబండ తీసుకుని ఆదినారాయణ, శ్యామల ఇంటి ఎదుట రోడ్డుపై నిలబడి ఉండగా ఆదినారాయణపై దాడి చేశారు. శ్యామల అడ్డురాగా ఆమెను సాలమ్మ కొట్టింది. వారిని అడ్డుకునేందుకు ఆదినారాయణ తమ్ముడు చిన్న చౌడయ్య అడ్డురాగా అతనిని కొడవలితో నరికి, రోకలిబండతో కొట్టడంతో కిందపడ్డాడు. చిన్నచౌడప్ప భార్య అడ్డురాగా ఆమెను పక్కకు తోసి కింద పడిన చౌడప్పను సూర్యనారాయణ, రామాంజనేయులు, సాలమ్మ.. అతని కాళ్లు, చేతులు పట్టుకోగా పెద్దన్న కొడవలితో చిన్న చౌడప్ప గొంతు కోశాడు. చౌడప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శింగనమల పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు జరిపిన అప్పటి సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ చార్జిషీటు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున రాచమల్లు హరినాథ్‌రెడ్డి వాదించారు. జిల్లా కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున 10మంది సాక్షులను విచారించారు. ముద్దాయిలపై నేరం రుజువు కావడంతో నలుగురికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు.



జనసేనలోకి చేరికలు

కదిరి, జనవరి 8: పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కదిరికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, బ్లూమూన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ మంచి శివశంకర్, అఖిల భారత కాపు సమాఖ్య అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులు, కొమ్మినేని చిన్నపరెడ్డి జనసేనలో చేరారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, రాబోయే ఎన్నికల్లో సమర్థవంతంగా పని చేయాలని పవన్ కళ్యాణ్ వారికి సూచించారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హౌస్ అరెస్టు

ధర్మవరం, జనవరి8: ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) దశలవారీ ఉద్యమంలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9నుంచి విజయవాడలో 36 గంటల ధర్నాకు పిలుపునిచ్చింది. అయితే ఈ ధర్నాకు వెళ్లకూడదని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు శెట్టిపిజయచంద్రారెడ్డిని పట్టణ పోలీసులు సోమవారం సాయంత్రం హౌస్ అరెస్టు చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ చలమారెడ్డి ముందస్తు నోటీసు ఇచ్చి అరెస్టు చేశారు.

28వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

- కదిరిలో జీఓ2 ప్రతుల దహనం

కదిరిఅర్బన్, జనవరి 8: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరింది. పట్టణంలోని అంగన్‌వాడీలు ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడాన్ని నిరసిస్తూ స్థానిక టవర్ క్లాక్ వద్ద జీవో నంబర్ 2 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. తక్షణమే ఎస్మాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మాబూన్నీసా, సుజాత, లక్ష్మీదేవి, సువర్ణ, మాధవి, రామలక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోగా, ఎస్మాతో తమ సమ్మెను అణచివేయాలని చూస్తోందని, వాటికి భయపడే ప్రసక్తే లేదని మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట 28వరోజూ సమ్మెను వారు కొనసాగించారు. ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షులు ఆశీర్వాదమ్మ, మణిమాల పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు కుళ్లాయప్ప, శ్రీరాములు మద్దతు తెలిపారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బైఠాయించి దండాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకుడు లక్ష్మీనారాయణ మద్దతు పలికారు.

గాండ్లపెంట: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల రహదారి వద్ద అంగన్‌వాడీలు వర్షం పడుతున్నా, తడుస్తూనే సమ్మె చేపట్టారు. ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించమని స్పష్టం చేశారు.



కదిరిలో జీవో నంబర్ 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



నల్లమాడలో దండాలు పెడుతూ నిరసన



ఓడీసీలో సీడీపీఓ కార్యాలయం ఎదుట సమ్మె



గాండ్లపెంటలో వర్షంలో తడుస్తూ సమ్మె

టీడీపీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయండి

కొత్తచెరువు, జనవరి 8: వచ్చే ఎన్నికల్లో కష్టపడి పని చేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పిలుపునిచ్చారు. టీడీపీ పుట్టపర్తి నియోజవర్గ అధికార ప్రతినిధి కిలారి శ్రీనాథ్ సోమవారం బాలకృష్ణను హిందూపురంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... కష్టపడి పనిచేస్తే భవిష్యత్తు టీడీపీదేనన్నారని శ్రీనాథ్ చెప్పారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.



బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కిలారి శ్రీనాథ్



బాలకృష్ణను సన్మానిస్తున్న రామాంజనేయులు

బాలకృష్ణను కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు

అమడగూరు: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను హిందూపురంలోని ఆయన నివాసంలో సోమవారం అమడగూరు మండలానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు రామాంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా బాలకృష్ణను శాలువా, పూలమాలతో సత్కరించారు. దివ్యాంగుడైన రామాంజనేయులును బాలకృష్ణ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించినట్లు రామాంజనేయులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పాలిటెక్నిక్ విద్యార్థిని

ధర్మవరంరూరల్, జనవరి8: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సెకెండియర్ విద్యార్థిని సుమశ్రీ రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, పీడీ రాజేష్ సోమవారం తెలిపారు. సుమశ్రీ ఐపీఎస్‌జీఎం రీజనల్, ఉమ్మడి జిల్లాల విద్యార్థినులతో తలపడి ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



సుమశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

కదిరిఅర్బన్,జనవరి 8: సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం 14వరోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి కాలేజీ సర్కిల్ వరకు అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. పలువురు మాట్లాడుతూ గత 14రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వేమయ్యయాదవ్, ఆంజనేయులు, రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ ధర్నా

ఓబుళదేవరచెరువు, జనవరి 8: తమకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం స్వచ్ఛభారత్, పంచాయతీకార్మికులు ధర్నా చేశారు. వీరికి సీఐటీయూ మండల అధ్యక్షకార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు మద్దతు తెలిపి మాట్లాడారు. స్వచ్ఛభారత్ కార్మికులకు 13 నెలలు, పంచాయతీ కార్మికులకు 8నెలల వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. వాటిని వెంటనే చెల్లించాలన్నారు. జీతాలు చెల్లించాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రామనాథ్‌రెడ్డికు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం నాయకులు అంజనప్ప తదితరులు పాల్గొన్నారు .



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

కలెక్టరేట్‌లో స్పందనకు 318 వినతులు

- స్వీకరించిన జేసీ, డీఆర్వో

పుట్టపర్తి, జనవరి 8: పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 318 వినతులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ వీటిని అందించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య ఈ వినతిపత్రాలు స్వీకరించారు. ముదిగుబ్బ మండలానికి చెందిన నారాయణ స్వామి, చెన్నమ్మ తమకు వికలాంగ పింఛన్ రద్దు చేశారంటూ వాపోయారు. పింఛన్ తిరిగి ఇప్పించాలని కోరారు. కొత్తచెరువుకు చెందిన లక్ష్మీదేవి తన భర్త చనిపోయారని, ఆయన పేరుతో ఉన్న భూమిని తనపేరుపై మార్చాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఇలా అనేక ప్రాంతాల ప్రజలు వివిధ సమస్యలపై వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, సచివాలయ కోఆర్డినేటర్ శివారెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 45 వినతులు

పుట్టపర్తిరూరల్: పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 45 వినతులు అందాయి. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు విచ్చేసి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ వినతిపత్రాలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ విష్ణు వీటిని స్వీకరించి పరిశీలించారు. అర్జీదారులతో ఏఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పోలీసు చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్పందనలో వినతుల ద్వారా వచ్చిన సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఎక్కువగా భూసమస్యలు, రస్తావివాదాలు, కుటుంబకలహాలుపై వినతులు అందాయి. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాపోలీసు కార్యాలయంలో అర్జీదారుడితో మాట్లాడుతున్న ఏఎస్పీ విష్ణు

బీసీ కాలనీలో భవిష్యత్తుకు గ్యారెంటీ



ఓడీసీలోని బీసీ కాలనీలో కరపత్రాలను పంచుతున్న టీడీపీ నాయకులు



కదిరిపట్టణంలోని 22వ వార్డులో ..

ఓబుళదేవరచెరువు, జనవరి 8: మండలకేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి మండోజీ ఆర్ఫిఖాన్, మండల అధ్యక్షుడు చికెన్ షానూ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో ప్రచురించిన టీడీపీ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ తోఫీక్‌ఖాన్, ఎస్సీ సెల్ అంజనప్ప, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కదిరిలోని 22వ వార్డులో..

కదిరి: మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులో సోమవారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో పథకాలను వివరించారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు డైమండ ఇర్షాన్, బూత్ కన్వీనర్లు సీఎం ఇలియాజ్, ఈఎస్ఈ ఇలియాజ్, దాదాపీర్, నవాజ్, డాక్టర్ అస్రఫాలీ, షాకీరా, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

పుట్టపర్తి, జనవరి 8: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలంటూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుట్టిమద్ది ఓబులేసు, కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. పట్టణంలోని సాయి ఆరామంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్లుగా ఎస్సీవర్గీకరణ కోసం పోరాడుతున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతి జిల్లాలో మాదిగలకు ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగలను గుర్తించేపార్టీలకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఈనెల 31న విజయవాడలో జరిగే మాదిగల యుద్ధభేరీని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బీచిగానిపల్లి రామాంజనప్ప, నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను నిండా ముంచిన సీఎం: తెలుగుయువత

పుట్టపర్తి, జనవరి 8: ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, లక్ష ఉద్యోగాలిస్తామంటూ సీఎం జగన్ నిరుద్యోగులను నిండా ముంచారని తెలుగుయువత నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం హిందూపురం పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు బాబ్‌జాన్, ప్రధాన కార్యదర్శి ఎగువింటి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ విలేకరులతో మాట్లాడార. పాదయాత్రలో జగన్ నిరుద్యోగులకు లక్షల ఉద్యోగాలిస్తామని, ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీలిచ్చారని, అయితే అధికారంలోకి వచ్చి ఐదేళ్ల గడుస్తున్నా ఆ హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. మోసపూరిత హామీలతో నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు. డీఎస్సీ పేరుతో ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఉన్న పోస్టులనే కుదించేశారని దుయ్యబట్టారు. టీడీపీ పాలనలో రెండుమార్లు డీఎస్సీ వేసి 18వేల పోస్టులు భర్తీ చేశారని గుర్తు చేశారు. మోసపూరిత జగన్‌కు వచ్చే ఎన్నికల్లో యువత తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులరెడ్డి, నాయకులు నరేష్‌కుమార్, ఫుల్లప్పచౌదరి, హనుమంతు, శ్రీనివాసులు, గంగయ్య, రవి, బళ్లారి సుధాకర్, రమేష్, మనోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఏ కమిటీ ఎంపిక

కదిరిఅర్బన్, జనవరి 8: ఆల్‌ఇండియా స్టూడెంట్స్ అసోషియేషన్ (ఏఐఎస్ఏ) కదిరి మండల నూతన కమిటీని ఎంపిక చేసినట్లు డివిజన్ అధ్యక్షుడు కిరణ్‌దేవ్ తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎంపిక చేశామన్నారు. మండల అధ్యక్షుడిగా శివశంకర్, కార్యదర్శిగా రాజేష్‌కుమార్‌తో పాటు పలువురిని ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పుట్టపర్తి, జనవరి 8: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను అందరం తీసుకోవాలని డీఎస్పీ వాసుదేవన్ సూచించారు. పట్టణంలోని సిద్ధార్థ కోచింగ్ సెంటర్‌లో సోమవారం గ్రీన్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ శంకర్‌నారాయణకు సన్మానం చేశారు. పర్యావరణ పరిరక్షణకు శంకర్‌నారాయణ చేసిన కృషిని గుర్తించి, ఢిల్లీలోని సోక్రటీస్ సోషల్ రీసర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇందుకుగాను ఆయనకు సన్మానం చేశారు. డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొ మాట్లాడారు. ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం కృషిచేయాలన్నారు. అనంతరం శంకర్‌నారాయణను శాలువాలు, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ పుడా మాజీ ఛైర్మన్ కోటా సత్యం తదితరులు పాల్గొన్నారు.

స్వీప్‌పై విస్తృత ప్రచారం చేయండి: జేసీ

పుట్టపర్తి, జనవరి 8: స్వీప్ కార్యక్రమం ద్వారా ఓటింగ్ విధానాన్ని విస్తృతంగా ప్రచారం చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన స్వీప్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలి, వేసిన ఓట్లు ఏవిధంగా నమోదు అవుతాయన్న విషయాలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి స్వీప్ విధానం ఉపయోపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, స్వీప్ నోడల్ అధికారి శివరంగ ప్రసాద్, ఈడీటీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

ధర్మవరం, జనవరి 8: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో పార్కు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వన్‌టౌన పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీచెన్నకేశపురానికి చెందిన శ్రీరాములు, భార్య మంగమ్మతో కలిసి బైక్‌లో పట్టణంలోకి వచ్చాడు. పని అనంతరం తిరిగి ఇంటికి వెళ్తుండగా.. పార్కు వద్ద ఎదురుగా ప్రసాద్ అనే యువకుడు మరో బైక్‌లో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో శ్రీరాములు, మంగమ్మతో పాటు ప్రసాద్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం, జనవరి 8: సంక్రాంతి సెలవురోజుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మంగళవారం నుంచి ఈనెల 18వతేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించిందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు కూడా ఆ తేదీల్లోనే సెలవులు ప్రకటించాలన్నారు. సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నందకిశోర్, హరి, వినోద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణాధ్యక్షుడిగా పరిశే సుధాకర్



ధర్మవరం, జనవరి 8: టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పరిశే సుధాకర్ ఎంపికయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఈ ఎంపిక జరిగింది. పరిశేసుధాకర్‌ను పట్టణ అధ్యక్షుడిగా పరిటాలశ్రీరామ్ ప్రకటించారు. తాను పదేళ్లుగా టీడీపీలో ఉంటూ పార్టీకి ఎన్నో సేవలందించానని, ఈ సేవలను గుర్తించి పరిటాలశ్రీరామ్ తనను పట్టణ అధ్యక్షుడిగా ప్రకటించారని పరిశేసుధాకర్ తెలిపారు. ఈయన గతంలో టౌన్ బ్యాంక్‌అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. తనను ఎంపిక చేసిన పరిటాలశ్రీరామ్‌కు, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వడ్డే ఓబన్న జయంతికి తరలిరండి

అమడగూరు, జనవరి 8: స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఈనెల 11వతేదీన మండలకేంద్రంలో నిర్వహించనున్నట్లు వడ్డెర సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరాం పిలుపునిచ్చారు. మండలంలోని ఏ.కొత్తపల్లిలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. వడ్డే ఓబన్న జయంతి వేడకలకు కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో అనాథలకు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. కళాకారుల చేత సాంస్కృతిక కార్యక్రమా లు జరపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టైలర్ జయరాం, వలిపి క్రిష్టప్ప, వలిపి రామచంద్ర, నాగరాజు, పీట్ల సుధాకర్, లక్ష్మణ, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు అధికారుల డుమ్మా

గాండ్లపెంట, జనవరి 8: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వివిధ శాఖలాధికారులు డుమ్మా కొట్టడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాల్లో స్పందన నిర్వహిస్తోంది. ఇందులో మండలాధికారులు హాజరై, ప్రజల సమస్యలు పరిష్కరించాలని ముఖ్య ఉద్దేశ్యం. మండల అధికారులు స్పందనకు ప్రతివారం డుమ్మా కొడుతూ సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎప్పుడో ఒకసారి వచ్చి సంతకాలు చేసి వెళ్లడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. తహసీల్దార్ దృష్టి సారించకపోవడంతోనే అధికారులు డుమ్మా కొడుతున్నట్లు ప్రజలంటున్నారు. ఈ సోమవారం కూడా చాలా మంది డుమ్మా కొట్టడంతో కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.



ధర్మవరంలోని కాకతీయ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



రూపారాజ పీసీఎంఆర్ పాఠశాలలో..



ముదిగుబ్బలోని పీవీఎస్ పాఠశాలలో ..

పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌లైన్ నెట్‌వర్క్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండలకేంద్రాల్లోగల పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలను ఘనంగా జరిపారు. పాఠశాలల ఆవరణలలో నిర్వాహకులు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పూలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే భోగిమంటలు వేశారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో, హరిదాసు, గంగిరెద్దుల వారి వేషధారణలతో ఆకర్షించారు. పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.



కదిరిలోని సాధన పాఠశాలలో బొమ్మల కొలువు..



ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద గల బ్లూమూన్ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ధర్మవరం మండలం గొట్లూరులోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో..

ఇద్దరు ఎస్ఐల బదిలీ

గోరంట్ల, జనవరి 8: గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐలు బాబు, లక్ష్మీనారాయణను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల నిబంధనల మేరకు సొంత జిల్లాల్లో పనిచేయకూడదన్న నిబంధనతో వారు బదిలీపై వెళ్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వారి స్థానాల్లో కొత్తవారిని నియమించే అవకాశముంది.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అగళి, జనవరి 8 : అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను శనివారం మండలకేంద్రం లోని గాయత్రి కాలనీలో బీజేపీ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు ఆనంద్ నాయక్ తోపాటు మరికొంత మంది ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. త్వరలోనే అయోధ్యలో రామమందిరం ప్రారంభవవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నేతలకు నోటీసులు





యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, భూతన్నకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

మడకశిర రూరల్/రొళ్ల, జనవరి 8: సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడలో మంగళవారం నుంచి తలపెట్టిన 36 గంటల దీక్షకు ఉపాధ్యాయులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. పలువురు ఉపాధ్యాయ నేతలకు సోమవారం నోటీసులు అందజేశారు. పెనుకొండ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్‌కు నోటీసులు అందజేశారు. ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, నియోజకవర్గ స్థాయి నాయకుడు మాలింగప్పకు పోలీసులు నోటీసులు అందజేశారు.

ప్రధానోపాధ్యాయురాలిపై విచారణ

లేపాక్షి, జనవరి 8: మండలంలోని చోళసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల సిబ్బంది పట్ల దురుసుగా ప్రవరిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు ప్రధానోపాధ్యాయురాలు సుధామణిపై ఉన్నతాధికారులు సోమవారం విచారణ చేపట్టారు. హెచ్ఎం తీరుపై ఉపాధ్యాయులు, సిబ్బంది.. కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అరుణ్‌బాబు.. హెచ్ఎంపై విచారణకు ఆదేశించారు. విద్యాశాఖ ఏడీ నాగరాజు, సూపరింటెండెంట్ ప్రసాద్‌ను విచారణాధికారులుగా నియమించారు. సోమవారం విచారణాధికారులు పాఠశాలకు చేరుకుని సిబ్బంది, ఎంఈఓ నాగరాజునాయక్ సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం ఏడీ నాగరాజు మాట్లాడుతూ.. విచారణ పూర్తి చేశామనీ, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

తెలుగు భాషా పురస్కారానికి జాబిలి ఎంపిక

పెనుకొండ, జనవరి 8: ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలు గు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ సంయుక్తంగా జాబిలి చాంద్ బాషాకు తెలుగు భాషా ప్రతిభా పురస్కారం ప్రకటించింది. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో జరిగే అనంత తెలుగు భాష వైభవ సదస్సులో మంగళవారం ఈ పురస్కారాన్ని అందుకుంటున్నట్లు జాబిలి తెలిపారు.

సాయికాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప



వైద్యశాలను ప్రారంభిస్తున్న శిల్ప

పెనుకొండ, జనవరి 8: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శివసాయి మందిరం వ్యవస్థాపకుడు డాక్టర్ సాయికాళేశ్వర్ పేద ప్రజల కోసం చేపట్టిన సేవా కార్యక్రమాలను శక్తివంచనలేకుండా కొనసాగించేం దుకు కృషిచేస్తానని గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొ న్నారు. స్థానిక కాళేశ్వర్ ఆశ్రమంలో సోమవారం స్వామి 51వ జయంతిని పురస్కరించుకుని నవ్యశ్రీ ఉచిత కంటి వైద్యశాలను శిల్ప చేతులమీదుగా ప్రారంభించారు. ముందుగా కాళేశ్వర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ... సాయికాళేశ్వర్ పేద ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, 2007లో కుమార్తె నవ్యశ్రీ పేరుతో ఉచిత కంటివైద్యశాలను ఏర్పాటు చేశారన్నారు. కరోనా సమయంలో కొన్ని రోజులు మూసివేశామని, మళ్లీ పునఃప్రారంభించామన్నారు. ప్రతిరోజూ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలతోపాటు అవసరమైన శస్త్రచికిత్సల చేయిస్తామన్నారు. మొదటి రోజు కంటి వైద్య నిపుణులు కే భాస్కర్ 54మందికి కంటి పరీక్షలు నిర్వహించి 38మందికి కంటి అద్దాలను అంద జేశామన్నారు. ఏడుగురిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. ఈ శిబిరాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్ర మంలో బీపీఎం అనూరాధ, డీఎస్ఓ మనుమంతరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, చిట్టిబాబు, హరి, బాబు ప్రసాద్, ప్రగతి శ్రీనివాసులు, జాన్ ప్రియనాథ్, లాయర్ భాస్కర్‌రెడ్డి, పుర ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

రొద్దం, జనవరి 8 : మండలంలోని చోళేమర్రి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఈడిగ అంజనప్ప(65) అనారోగ్యంతో మృతిచెందాడు. టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నప్పయ్య సోమవారం చోళేమర్రికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ జనార్దన్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

చిలమత్తూరు, జనవరి 8: మండలంలోని పాతచామలపల్లి చెరువులో పడి ఒక వ్యక్తి మరణించాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొన్నాళ్లు కర్ణాటక రాష్ట్రం గుడిబండ తాలూకా ఉప్పరహళ్లికి చెందిన శంకరప్ప (50) అనే వ్యక్తి పాతచామలపల్లి చుట్టు పక్కల గ్రామాల్లో భిక్షాటన చేయడం, పాములు పట్టడం వంటి పనులు చేస్తూ జీవనం చేస్తున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో మృతుడు శంకరప్ప ఆదివారం రాత్రి మద్యం తాగి పాతచామలపల్లి చెరువు కట్ట తూముపై పడుకొని నిద్రపోయాడు. మద్యం మత్తులో ఉన్న అతడు నిద్రలోనే తూముపై నుంచి నీటిలోకి పడిపోయాడు. మత్తులో ఉన్న కారణంగా నీటిలో మునిగి ప్రాణాలు వదిలాడు. గ్రామస్థులు సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పోలీసులు విచారణ చేపట్టారు. ఐదేళ్ల క్రితమే మృతుడి భార్య మృతి చెందిందని, నలుగురు కుమార్తెలు ఉన్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. వారికి సమాచారం ఇవ్వగా రెండో కుమార్తె సుమిత్ర వచ్చి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

చేయి వేయాలంటే నన్ను దాటాలి

మంత్రి ఉషశ్రీచరణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ

పెనుకొండ రూరల్, జనవరి 8: ఎంతో ప్రశాంతంగా ఉండే పెనుకొండలో మంత్రి ఉషశ్రీచరణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులపై చేయి వేయాలంటే మొదట తనను దాటుకుని వెళ్లాలని టీడీపీ వారిని రెచ్చగొట్టారు. పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి ఉషశ్రీచరణ్‌ను ఇటీవలే వైసీపీ నియమించింది. ఈ నేపథ్యంలో పెనుకొండలోని ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఇంటివద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సోమవారం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. 'యుద్ధం మొదలైంది.. శంఖం పూరించండి' అని మంత్రి తమ పార్టీ కార్యకర్తలనుద్దేశించి అన్నారు. టీడీపీ వారు వైసీపీ నాయకులు, కార్యకర్తలపై చేయి వేయాలంటే మొదట తనను టచ్‌చేసి వెళ్లాలన్నారు. ప్రతిపక్ష టీడీపీ వైపు నుంచి ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు, రెచ్చగొట్టే మాటలు లేకపోయినా.. మంత్రి ఇలా నిప్పు రాజేసే మాటలు మాట్లాడటం విమర్శలకు తావిచ్చింది. ఆమె రాకతో తమ ప్రశాంతతకు ముప్పు వాటిల్లేలా ఉందని పెనుకొండ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి ఆర్భాటంతో ప్రయాణికులకు ఇబ్బందులు

పెనుకొండలోని మడకశిర రహదారిలో ఉన్న ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఇంటి వద్ద మంత్రి సమావేశాన్ని నిర్వహించారు. దీంతో ఆ మార్గంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. మంత్రి సమావేశంలో మధ్యాహ్నం 12 గంటలకు మొదలైంది. సమావేశానికి వచ్చిన అధికార పార్టీవారు రహదారిలో వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కింగ్ చేశారు. దీనికితోడు మంత్రి పర్యటన ముగిసేవరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో పెనుకొండ -మడకశిర మార్గంలో ట్రాఫిక్ గంటల తరబడి స్తంభించింది. మడకశిర రహదారిలో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. చేసేది లేక ఆర్టీసీ ప్రయాణికులు బస్సులు దిగి నడుచుకుంటూ పట్టణంలోకి వచ్చారు. ఆటోలు వెళ్లేందుకూ వీలు కాకపోవడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మంత్రి సమావేశం వైపు వాహనాలు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు



బస్సు దిగి పెనుకొండ పట్టణంలోకి నడిచి వస్తున్న ప్రయాణికులు

ఎస్మాతో భయపెట్టకండి

డిమాండ్లు సాధించుకునే వరకు సమ్మె విరమించం : అంగన్‌వాడీలు



గోరంట్లలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు పెద్దన్న



మడకశిరలో ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

ఎస్మా చట్టంతో భయపెట్టొద్దని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చిలమత్తూరులో సోమవారం వారు నిరవధిక సమ్మెలో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల యూనియన్ నాయకులు మాట్లాడుతూ.... ప్రధానంగా ఎస్మా జీఓ2ను తమపై ప్రయోగించి సమ్మెను బలవంతంగా విరమింప జేసేందుకు ప్రయత్నాలు చేయడం తగదని హెచ్చరించారు. తమకు దక్కాల్సిన న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం తాము 28 రోజులుగా నిరవ ధికంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఈ తరుణంలో తమను భయపెట్టి దారికి తెచ్చుకోవాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. దీని పర్యవసా నాలు మరోవిధంగా ఉంటాయని వారు హెచ్చరించారు. తమ డిమాండ్లు సాధించుకునే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. ఈ సందర్భంగా వారు హరికథ చెప్పుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. పెనుకొండలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు కుంభకర్ణ విగ్రహానికి వినతి పత్రం అందిస్తూ నిరసన వ్యక్తం చేశారు. లేపాక్షి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు దీక్షలు చేస్తున్న శిబిరం వద్దకు రైతులు వెళ్లి వారికి మద్దతు పలుకుతూ నినాదాలు చేశారు. అలాగే మడకశిర పట్టణం, గుడిబండ, ఆగళి మండలకేంద్రాల్లో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. గోరంట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్ వాడీలు దీక్షలు చేపట్టిన శిబిరం వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న వచ్చి మద్దతు తెలిపారు. అన్నికార్మిక సంఘాల అండతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద జైలు భరో నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను తహసీల్దార్ రంగనాయకులు పిలిపించి వెంటనే విధుల్లో చేరాలని తెలిపారు. అంగన్‌వాడీలు సమ్మె చేయడం వలన ప్రజా వ్యవస్థకు అవరోధం కలుగుతుండడంతో ప్రభుత్వం జీఓ విడుదల చేసిందన్నారు. ఈ కారణంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై క్రిమినల్ కేసులు బనాయించడం, ఉద్యోగాలనుంచి తొలగించడం లాంటిపరిస్థితులు ఎదురవుతాయని, ఆలోచించి నిర్ణయించుకోవాలని తహసీల్దార్ సూచిం చారు. దీనికి అంగన్‌వాడీలు సమాధానమిస్తూ తమ యూనియన్‌లో చర్చించిన తరువాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

మోటార్లకు మీటర్లు, రైతులకు ఉరితాళ్లు

ఇదే జగన్ పాలన ఖ్యాతి: బీకే



పెనుకొండ, జనవరి 8: ముఖ్యమంత్రి జగన్ పాలనలో అన్నీ విధ్వంసాలు, అరాచకాలే అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. ఆయన సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రజారాజధానిని నిర్వీర్యం చేసి ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలు పెట్టిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేర న్నారు. వ్యవసాయశాఖను మూసివేశారని విమర్శించారు. హార్టికల్చర్ రైతు రోడ్డున పడ్డాడని, ధాన్యం రైతు దగాప డ్డాడన్నారు. పచ్చని రాష్ట్రంలో నేడు రోజుకు ముగ్గురు రైతుల ఆత్మహత్యలు, అన్నదాన ఆక్రందనలే వినిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రికార్డులు ఏంటో తెలుసా... రాష్ట్రాన్ని కౌలురైతు ఆత్మహత్యల్లో రెండోస్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానం, రైతు అప్పుల్లో దేశంలోనే మొ దటి స్థానం అన్నారు. ఈ మేరకు జగన్‌పాలన ఖ్యాతి గడించిందన్నారు. ధాన్యం కొనేవారులేరు... డ్రిప్ సబ్సిడీలు రావు... మద్దతు ధర మాటేలేదు. .. అన్నదాతకు బతుకేలేకుండా చేసిన ఘనుడు ఈ ముఖ్యమంత్రి అన్నారు. రివర్స్ టెండర్ల పేరుతో నీటి పారుదలను సర్వనాశనం చేశాడన్నారు. రాష్ట్రా న్ని గంజాయి రాష్ట్రంగా మార్చిన ఘనత ఆయనదేనన్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తే జగన్ పాలనలో ఉన్న పరిశ్ర మలన్నీ ఇతర రాష్ట్రాలకు తరలి పోయాయన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే మూడు రాజధానులు అంటూ రాజధానిని అమరావతి నుంచి మార్చేందుకు ప్రయత్నించారన్నారు. జగన్ 175మంది అభ్యర్థులను మార్చినా వైసీపీ ఒక్కటేనని, ఎవరూ మార్చలేదన్నారు.

రైతులను నట్టేట ముంచిన జగన్

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



మధూడిలో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందిస్తున్న గుండుమల

మడకశిరటౌన్, జనవరి 8: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల ఆత్మహత్యలు పెరిగాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆరోపించారు. అన్నదాతల ఆక్రందనలు ఈ ప్రభుత్వానికి వినిపించవని, రైతులను నట్టేట ముంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. ఆయనసోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వం తమ చేతకాని తనంతో రైతులకు ఉరి వేసిందని, ఇరిగేషన్‌ను బలి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కౌలురైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలో, రైతు అప్పుల్లో దేశంలో మొదటి స్థానంలోకి తెచ్చిన రికార్డులు జగన్‌కే దక్కుతాయన్నారు. రైతులు పండించిన ధాన్యం కొనేవారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రిప్ సబ్సిడీలు రావని, అన్నదాతలకు బతుకే లేకుండా చేసి జగన్ రైతు ద్రోహిగా మిగిలిపోతారన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరాన్ని గోదావరిలో కలిపివేశారని, యువతను చీకట్లో నెట్టేశారని ఆగ్రహించారు. సంక్షేమాన్ని సంక్షోభంగా మార్చారని విమర్శిం చారు. చివరకు తన ఎమ్మెల్యేలను నమ్మే పరిస్థితుల్లో జగన్ లేరన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

చంద్రబాబును సీఎం చేస్తాం

అగళి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2024ఎన్నికల్లో గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని మధూడి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ పాలన అన్ని రంగాల్లో విఫలమైందని, వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జడ్పీటీసీ ఉమేష్, మధు, కుమారస్వామి, మాజీ ఎంపీపీ నరసింహ, శ్రీనివాసులు, జయన్న, కరియన్న పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



ముందస్తు సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు

హిందూపురం అర్బన్, జనవరి 8: సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని పలువురు పేర్కొన్నారు. పట్టణంలోని నారాయణ పాఠశాల, జ్ఞానజ్యోతి పాఠశాలలో. సోమవారం స్థానిక సంక్రాంతి పండుగ ముందస్తుగా నిర్వహించారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు



ముగ్గులపోటీలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

గోరంట్ల, జనవరి 8: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో సోమవారం పుట్టపర్తికి చెందిన బ్లోసమ్స్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గులపోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభచూపిన వారికి బహుమతులు అందించారు.

కొనసాగిన పారిశుధ్య కార్మికుల నిరసన

పనులు చేయకుండా కొత్త వర్కర్లను అడ్డుకున్న వైనం



కొత్త వర్కర్లను, మున్సిపల్ అధికారులను అడ్డుకుంటున్న కార్మికులు

మడకశిరటౌన్, జనవరి 8: మడకశిర నగర పంచాయతీ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల నిరసన కొనసాగింది. పారిశుధ్య పనులు చేయడానికి సోమవారం మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయగా వారు అడుగడుగునా అడ్డుకున్నారు. మధ్యాహ్నం నగర పంచాయతీ అధికారులు పట్టణంలో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు కమీషనర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో కొత్త వర్కర్లను తీసుకొచ్చారు. అయితే సమ్మె చేస్తున్న కార్మికులు అమరాపురం బస్టాండు ఆవరణంలో అడ్డుకున్నారు. రోడ్డుపై పడుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కొత్త వర్కర్లతో చెత్తను ఎత్తడానికి వెళ్లినా అడ్డుపడ్డారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పనులు జరగనివ్వమని భీష్మించుకొని కూర్చొన్నారు. చివరకు చేసేదిలేక కార్మికులు వెనుదిరిగారు. రాత్రి మున్సిపల్ ఆర్‌డీ మూర్తి మడకశిరకు వచ్చారు. వెంటనే పట్టణంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు రాత్రి 8 గంటల సమయంలో పనులు చేసేందుకు కొత్త వర్కర్లను తీసుకురాగా తిరిగి మున్సిపల్ కార్మికులు అడ్డుకొన్నారు. దీంతో ఏమి చేయాలో అంతు పట్టని స్థితిలో ఏం నిర్ణయం తీసుకొంటారో వేచి చూడాలి.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

టీడీపీ నాయకులు



మడకశిరలో పాల్గొన్న టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జనవరి 8: బాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని, రాష్ట్ర రూపురేఖలు మారాలంటే ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గం పరిశీలకులు పార్థసారథిరెడ్డి అన్నారు. పట్టణంలోని అమరాపురం బస్టాండు సమీపంలోని కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి భవిషత్తుకు గ్యారంటీ కార్డులను అందించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు భక్తర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మాజీ కౌన్సిలర్ ఫయాజ్, బూత్ కన్వీనర్లు రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురంలో...



అమరాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, జనవరి 8: ప్రస్తుతం క్లిష్టపరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించే ఏకైక నాయకుడు చంద్రబాబు అని టీడీపీ ఎస్సీసెల్ నియోజకవర్గం అధ్యక్షుడు ఆర్ జయకుమార్ అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అన్నారు. అమరాపురం మండల కేంద్రంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి భవిషత్తుకు గ్యారంటీ కార్డులను అందించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మైనారిటీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి దాదు, క్లస్టర్ ఇన్‌చార్జి రవికుమార్, యూనిట్ ఇన్‌చార్జి రఘు, నవీన్, శివకుమార్, మంజు, శివకుమార్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో పావగడలో జనస్పందన

పావగడ, జనవరి 8: తుమకూరు జిల్లా కలెక్టర్ శుభకల్యాణి ఆధ్వర్యంలో మంగళవారం పావగడలో జనస్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వరదరాజు సోమవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో జన స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా కలెక్టర్‌తో చర్చించి అర్జీలు చెల్లించి పరిష్కారం పొందవచ్చన్నారు. పావగడ ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'తుంగభద్ర నీరివ్వకపోతే పెద్దఎత్తున ధర్నా'



ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, జనవరి 8: తుంగభద్ర డ్యాం నుంచి పావగడకు తాగునీరు అందించకపోతే పెద్దఎత్తున ధర్నా చేపడుతామని ప్రముఖ వైద్యులు, వివేకానంద విద్యా సంస్థ కార్యదర్శి డాక్టర్ జీ వెంకటరామయ్య తెలియజేశారు. రాష్ట్ర కిసాన్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భద్రా తాగునీటిని తరలించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి అయి తొమ్మిది నెలలు కావసస్తున్నప్పటికీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ఇప్పటివరకు నీరు అందలేదన్నారు. ప్రజా ప్రతినిధులు ఈవిషయంపై శ్రద్ధ తీసుకొని నీరు తరలించేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 2017లో అప్పటి సీఎం సిద్దరామయ్య నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఆయనే సీఎంగా ఉన్నారని తాగు, సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర కిసాన్ సంఘం అధ్యక్షుడు నాగభూషణ్‌రెడ్డి డిమాండ్‌చేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు నీటి పారుదల శాఖ అధికారి హనుమంతప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, గోవిందప్ప, అన్నపూర్ణమ్మ, గాయిత్రి, అలివేలమ్మ, లలితమ్మ పాల్గొన్నారు.